ఆదోనిలో ఎండుమిర్చి యార్డు ప్రారంభం

- మిర్చి రైతుల హర్షం
- క్రయవిక్రయాలకు నిబంధనలు రూపొందించండి
- దూర ప్రాంతాలకు వెళ్లి రైతులు ఇబ్బందులు పడొద్దు
- ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి సూచనలు



మిర్చి దిగుబడిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోనిఅర్బన్: గుంటూరు, కర్ణాటక రాష్ట్రం బ్యాడిగి ప్రాంతంలోని యార్డుల్లో ఎండుమిర్చి క్రయ, విక్రయాలు ఎలా జరుగుతాయో ఆదోని ప్రాంతంలోని మిర్చి రైతులకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని వెనక భాగంలో ఎండుమిర్చి క్రయ, విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్, వైస్ చైర్మన్ తిమ్మప్ప, ఏడీఎం నారాయణమూర్తి పాల్గొన్నారు. రైతులు తెచ్చిన మిర్చి దిగుబడులను వ్యాపారస్తులు వేలం వేశారు. యార్డులో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాయలసీమలోనే మొదటిది, అతిపెద్ద మార్కెట్ అయిన ఆదోనిలో మిర్చి యార్డు లేకపోవడంతో రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం ఎండు మిర్చి క్రయవిక్రయాలు ప్రారంభించామన్నారు. ఇకపై మిర్చి రైతులు గుంటూరు, కర్ణాటక రాష్ట్రంలోని బ్యాడిగి ప్రాంతానికి మిర్చి దిగుబడులను తీసుకెళ్లేందుకు ట్రాన్స్‌పోర్టు ఖర్చులు, సొంత ఖర్చులతో పాటు ఇతర అవస్థలు పడాల్సిన అవసరం లేదన్నారు. ఆదోని మిర్చి యార్డును సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, పరిగెల నారాయణ, డైరెక్టర్లు బసవరాజ్, అనిల్‌కుమార్, అసోసియేషన్ సభ్యులు వీరభద్రగౌడ, రాజాగౌడ, వేర్‌హౌస్ గోడౌన్ యజమాని సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

యార్డులోనే అన్ని సౌకర్యాలు

రైతులు ఇబ్బందులు పడకుండా యార్డులోనే కూరగాయల మార్కెట్‌ను కూడా ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే చెప్పారు. ఇక రైతులు పండించిన దిగుబడులను రోడ్లపై ఎక్కడపడితే అక్కడ అమ్ముకుంటూ ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు.ఆదోని మార్కెట్ యార్డులో పత్తి, వేరుశనగ, ఆముదాలు, శనగలు, కుసుములు, కూరగాయలు, ప్రస్తుతం ఎండుమిర్చి విక్రయాలు సహా అన్ని వ్యాపారాలు జరిగేలా ఏర్పాటు చేశామన్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి

గుంటూరు, బ్యాడిగి తదితర ప్రాంతాల్లో ఎండు మిర్చి క్రయ, విక్రయాలు ఎలా జరుగుతాయో రైతులకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మిర్చి యార్డు ఆదోనిలో ప్రారంభమైందన్న విషయాన్ని గ్రామాల్లోని రైతులకు తెలియజేయాలన్నారు.

ఖర్చులు మిగిలాయి



కర్ణాటక రాష్ట్రంలోని బ్యాడిగిలో ఏ ధర అయితే లభిస్తుందో అదే ధర నా మిర్చి దిగుబడికి వచ్చింది. నేను 29 సంచుల ఎండు మిర్చి దిగుబడిని యార్డుకు తీసుకొచ్చాను. క్వింటాల్‌కు రూ.24 వేలు ధర పలికింది. ఆదోనిలో మిర్చి కొనుగోలు చేయడంతో రవాణా ఖర్చులు, వ్యయ ప్రయాసలతో పాటు రెండు రోజులు వేచి ఉండాల్సిన శ్రమ తగ్గింది. ఈ సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే, యార్డు అధికారులకు కృతజ్ఞతలు.

– రాముడు, రైతు, దేవనకొండ

మంచి ధర పలికింది



నేను ఒకటిన్నర ఎకరాలో మిర్చి సాగు చేయగా ప్రస్తుతం 18 సంచుల దిగుబడులు వచ్చాయి. గుంటూరు, బ్యాడిగి మార్కెట్‌లలో ఏ ధర పలుకుతుందో ముందుగానే తెలుసుకున్నాను. నేను తెచ్చిన మిర్చికి క్వింటాల్‌కు రూ.23 వేలు ధర పలికింది. ఆ ప్రాంతంలో ఏ ధర ఉందో అదే ధర లభించింది. మంచి ధర పలకడం సంతృప్తిగా ఉంది. ఆదోనిలో మిర్చి యార్డు ఏర్పాటు చేయడం మిర్చి రైతుకు ఎంతో మేలు జరిగింది. లేదంటే 300 కి.మీ దూరం మిర్చిని తీసుకెళ్లి అమ్ముకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం.

– లక్ష్మన్న, రైతు, దేవనకొండ

17న ఉచిత వైద్య శిబిరం

ఆదోనిఅర్బన్: అవోపా ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన ఉచిత రక్తనాళాల వైద్య పరీక్షా శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) సభ్యులు ఎస్ఆర్ఐ నగేష్‌కాకుబాళ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రక్తనాళాలకు సంబంధించి మెలితిరిగిన నరాలు, బోదకాలు, పాదాల్లో వాపు, కాళ్లలో రక్త సరఫరా సరిగా లేకపోవడం, సిరి పుండ్లు, మొదలగు సమస్యలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అవోపా ఆదోని పట్టణ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కౌతాళం: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ సూచించారు. ఈ మేరకు బుధవారం కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల తలెత్తే సమస్యల గురించి వివరించారు. శారీరక, మానసికంగా ఎదుగుదల లేక అనేక సమస్యలు వస్తాయని వివరించారు. నవయూత్ అసోసియేషన్ సిబ్బంది రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటింగ్ విధానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్

మంత్రాలయం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటింగ్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం కార్యాలయంలో ఎలక్ట్రానిక్ బ్యాలెట్ యూనిట్‌ను అనుసంధానం చేయడంపై బూత్ లెవల్ ఆఫీసర్లకు వివరించారు. అలాగే నాయకులు, ప్రజలకు ఓటింగ్ విధానం, ఓటు పరిశీలనపై అవగాహన కల్పించారు. ఎలక్షన్ డీటీ శశి శేఖర్, రెవెన్యూ ఆఫీసర్ ఆదాం తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ల నియామకం



బాధ్యతలు స్వీకరిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు

కౌతాళం: మండలానికి నలుగురు వెల్ఫేర్ అసిస్టెంట్లు కొత్తగా నియమితులైనట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. కారుణ్య నియామకాల ప్రాతిపదికన మండలంలోని వివిధ సచివాలయాలకు కొత్తగా నలుగురు వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లను కలెక్టర్ నియమించినట్లు తెలిపారు. రవీంద్రనాథ్ – ఉప్పరహాల్ గ్రామం, హుసేని – బాపురం, నరసింహయాదవ్ – లింగాలదిన్నె, ధనేశ్వర్ రెడ్డి – పొదలకుంట గ్రామానికి నియమించినట్లు ఆయన వెల్లడించారు.

బాధ్యతల స్వీకరణ



ఎంఈఓ-1 వరప్రసాద్

కౌతాళం: మండలం విద్యాధికారి-1గా వరప్రసాద్ బుధవారం ఎంఆర్‌సీలో బాధ్యతలు తీసుకున్నారు. ఆలూరు జెడ్పీ బాయ్స్-1 పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా ఉన్న ఈయనకు జిల్లా ఉన్నతాధికారులు కౌతాళం-1 ఎంఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.


జేజేఎం ద్వారా ఇంటింటికీ కొళాయి

ఆదోనిరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి కుటుంబానికి మంచినీటి సదుపాయం కల్పించాలన్న సంకల్పంతో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జలజీవన్‌మిషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజుగౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు న్యాయాది లోకేష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని 10వ రోజు మండలంలోని సుల్తానపురం, మాంత్రికి గ్రామాల్లో నిర్వహించారు. అధికారులు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను వివరాలను తెలియజేశారు. బీజేపీ ఓబీసీమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డె శ్రీనివాసులు, బీజేపీ నాయకులు కోసిగయ్య, ఉషారాజ్, రాజేష్, శేఖర్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి

కౌతాళం: సాంస్కృతిక సాంప్రదాయాలకు హిందూ ధర్మం కొలమానం అని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సహసంయోజక్ చక్రవర్తి దేశాయ్ అన్నారు. బుధవారం కౌతాళంలోని కృష్ణావధూత ఆశ్రమంలో హిందూ ధర్మ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు గోవింద నామాలతో జై శ్రీరామ్ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయనతో పాటు సంస్కృతిక భారతి విభాగ్ సంయోజక్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. హిందువుల వేద సంపద అమూల్యమైనదని, వేదాంతశాస్త్రం, తత్వశాస్త్రం, పురాణాలు ధర్మాన్ని ఆచరించడానికేనని వివరించారు. హిందూ ధార్మిక సంస్థల పెద్దలు నరేష్, నాగరాజ్, పరుషురాం, భీమలింగారెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌కు ప్రత్యేక పూజలు



కోసిగి: స్థానిక కడపాళెం వీధిలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దుర్గాప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో వేకువజామున నుంచి స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ, వెండికవచన అలంకరణలు గావించి మహా మంగళ హారతులు పట్టి విశేష పూజలు నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి ధ్వజస్తంభంపై, ఆలయం ఎదురుగా ఉన్న తిమ్మప్ప స్వామి కొండపై జ్యోతిని వెలిగించి దీపోత్సవానికి అంకుర్పారణ పలుకుతారు. అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో వేలాదిగా దీపాలు వెలిగిస్తారు. అలాగే మండలంలోని జుమ్మాలదిన్నె, దుద్ది, కొల్మాన్‌పేట గ్రామాల్లో కార్తీక పూజలు నిర్వహించి ఘనంగా పండుగ జరుపుకున్నారు.

శాస్త్ర సాంకేతిక విజ్ఞానం పెంచుకోవాలి



విద్యార్థులు తయారు చేసిన నమూనా ప్రాజెక్టులను పరిశీలిస్తున్న విద్యాధికారులు



పెద్దకడబూరులో సైన్స్ నమూనా ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈఓ సువర్ణల సునీయం

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి శాస్త్ర సాంకేతిక రంగాలపై పట్టు సాధించాలని ఆదోని డివిజినల్ ఉప విద్యాధికారి జి.వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్‌ఫెయిర్ కార్యక్రమం బుధవారం జరిగింది. ప్రధానోపాధ్యాయుడు అలీం సిద్దిఖీ, మండల విద్యాధికారి శివరాములు మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులు తయారు చేసిన నమూనా ప్రాజెక్టులను పరిశీలించారు. మండలంలోని 8 పాఠశాలల నుంచి 45 నమూనా ప్రాజెక్టులను సైన్సు ఉపాధ్యాయులు విద్యార్థుల చేత తయారు చేయించి ఆవిష్కరించారు. న్యాయనిర్ణేతలు రవి, ఆదిమూర్తి 7 ఉత్తమ నమూనా ప్రాజెక్టులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఈ నెల 16న జిల్లా స్థాయిలో జరిగే సైన్స్‌ఫెయిర్‌లో వాటిని ప్రదర్శించనున్నట్లు తెలిపారు. పురపాలక ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున సైన్సు ఉపాధ్యాయులు రామయ్య, సుధాకర్, ప్రసాద్, సురేష్, రాధ, రేణుక, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఉమా రాజేశ్వరి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటుచేసిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఎంఈఓ సువర్ణల సునీయం ప్రారంభించారు. మండల పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొని వారు తయారుచేసిన నమూనా ప్రాజెక్టులను పరిశీలించారు. కంజంప్షన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ, ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్, లైట్ డిస్పర్షన్, సోలార్ ప్యానల్ స్ట్రక్చర్ ఆఫ్ ఆటమ్ గ్లోబల్ వార్మింగ్ వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. వ్యక్తిగత విభాగంలో మూడు, పాఠశాలలు, బృందం విభాగంలో మూడు ప్రాజెక్టులను జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. అందులో వ్యక్తిగత విభాగంలో 1.వర్షపు నీటి సంరక్షణ – గవిగట్టు స్కూల్, 2.ఆటోమేటిక్ స్ట్రీట్ లైటింగ్ – ఆదర్శ పాఠశాల, 3.హృదయం పనిచేసే విధానం, రక్త ప్రసరణ – చిన్నతుంబళం స్కూల్, గ్రూప్ విభాగంలో 1.అప్లికేషన్ ఆఫ్ ట్రిగోనామెట్రీ – పెద్దకడబూరు స్కూల్, 2.వెహికల్ పార్కింగ్ సిస్టమ్ – పెద్దకడబూరు స్కూల్, 3.డైనమో – కంబదహాల్ స్కూల్ ప్రాజెక్టులు ఎంపికైనట్లు తెలిపారు.

కోసిగి: విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై పట్టుసాధించాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి సూచించారు. బుధవారం కోసిగి బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఖలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాల విద్యార్థులచే సైన్స్ ఫేర్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఎంఈఓలు మొయినుద్దీన్, నాగేశప్ప విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. ఎంపీపీ ఈరన్న, నాయకులు నాడుగేని నరసింహులు, మంగమ్మ, మహంతేష్ స్వామి, ఈరన్న, కోసిగయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకే జనం మద్దతు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిరూరల్: ప్రజా సంక్షేమమే వైఎస్ జగనన్న ధ్యేయమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని నారాయణపురం గ్రామంలో బుధవారం రెండో రోజూ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4;30 గంటల వరకు 200 గృహాలను సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజలకు నేనున్నాననే భరోసా కల్పించారన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా ప్రజల ఇళ్ల వద్దకే పథకాలు అందిస్తున్నారన్నారు. గ్రామంలో సచివాలయం నిధులు రూ.40 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అలాగే జలజీవన్ పథకం ద్వారా తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 30 కొత్త విద్యుత్ స్తంభాలు మంజూరు చేయించి, లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. గ్రామంలో రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ గీతావాణి, ఆర్ఐ జయరామిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రమేష్, గ్రామ సర్పంచ్ సరళమ్మ, పురుషోత్తం, నాయకులు కామాక్షి తిమ్మప్ప, దేవిశెట్టి మంజుల, రేణుక, శ్రీలక్ష్మి, గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ భవనం ప్రారంభం

ఆదోనిరూరల్: మండలంలోని ధణాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు సకాలంలో ప్రభుత్వ సేవలు అందించేందుకు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చినట్లు తెలిపారు. వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు నరసింహమూర్తి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, గురునాథ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ హనుమయ్య, ఈరన్నగౌడ్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతో ప్రజల వద్దకే పాలన



ఆదోని 33వ వార్డులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆదోని 29వ వార్డులో ప్రగతి బోర్డును ఏర్పాటు చేసిన దృశ్యం



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న దృశ్యం



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోనిటౌన్: ప్రజల ముంగిటకే ప్రభుత్వం సేవలు అందిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పట్టణాధ్యక్షుడు దేవా, జేసీఎస్ కన్వీనర్లు ఫయాజ్, నరసింహులు, వెల్లాల మధుసూదనశర్మ అన్నారు. గత టీడీపీ పాలనలో ఏదైనా చిన్న సమస్య ఉన్నా ప్రభుత్వ అధికారులు, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, జగనన్న పాలనలో ప్రజల ముగింటకే ప్రభుత్వ సేవలు అందుతున్నట్లు వివరించారు. పట్టణంలోని 29, 33వ వార్డుల సచివాలయాల పరిధిలో బుధవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి వీధుల్లో ప్రదర్శన, జెండా ఆవిష్కరణ, నాలుగన్నరేళ్లలో వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి ఫలాల సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. వార్డు కౌన్సిలర్లు ఇంతియాజ్‌బాషా, నాగరత్నమ్మ, వసీం, కన్వీనర్లు అబ్బాస్, మునీర్, పర్హాద్‌బాను, జహీరాబేగం, యాసిన్, గౌస్, క్లస్టర్-1 అధ్యక్షుడు మమ్మత్తుస్వామి తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని మండల సచివాలయాల కన్వీనర్ వెంకటరామిరెడ్డి, ఎరిగేరి గ్రామ సర్పంచ్ గోవిందులు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ముందుగా గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామ ప్రధాన కూడలిలో జెండావిష్కరణ చేపట్టారు. అనంతరం సంక్షేమ పథకాలకు సంబంధించిన బోర్డును గ్రామ సచివాలయంలో ఆవిష్కరించారు. మాజీ సర్పంచ్ ధర్మన్న, నాయకులు నీలకంఠరెడ్డి, కార్యదర్శి యోగేశ్వర్‌రెడ్డి, గృహసారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

మంత్రాలయం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని పార్టీ మండల కన్వీనర్ భీమారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మంత్రాలయం సచివాలయం-3 పరిధిలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాఘవేంద్రనగర్‌లో పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పేదలందరికీ మేలు జరిగేలా ప్రభుత్వం పారదర్శకంగా పాలన సాగిస్తోందన్నారు. కాలనీలో తాగునీరు, డ్రెయినేజీ, సీసీ రోడ్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచ్ పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న మనోజ్‌కుమార్ రెడ్డి

ఆదోనిటౌన్: వైఎస్సార్‌సీపీ పాలనలో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పార్టీ యువ నాయకులు మనోజ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా బుధవారం 11వ వార్డులో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాను వివరిస్తూ ముందుకుసాగారు. కాలనీలో డ్రైనేజీ, కల్వర్టులు, పైపులైన్‌లు తప్పుపట్టాయని, కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. సమస్యలను ఎమ్మెల్యే, చైర్మన్, పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కౌన్సిలర్లు చిన్నా, చలపతి, రహీం, నాయకులు అల్తాఫ్, మారుతి, ఖాదర్, జహీర్, జలీల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు భూమి పూజ చేస్తున్న పి.మురళీమోహన్ రెడ్డి

కోసిగి: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగనన్న కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో రూ.12 కోట్లతో చేపట్టనున్న ఎత్తిపోతల పథకానికి గ్రామ, మండల నాయకులతో కలిసి భూమి పూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పంట పొలాలను సస్యశ్యామలం చేసేదిశగా ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రత్యేక కృషితో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 5 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు మంజూరు చేయించారన్నారు. కోసిగి మండలంలోనే ఐరన్‌గల్లు, కందుకూరు గ్రామాల వద్ద రెండు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు మంజూరు చేయించారన్నారు.ఈ పనులు పూర్తయితే కామన్‌దొడ్డి, కందుకూరు, అర్లబండ, మూగలదొడ్డి గ్రామాల్లోని 1200 ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. పనులు ప్రారంభం కావడంతో ఆయా గ్రామాల రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. మైనర్ ఇరిగేషన్ శాఖ డీఈ నాగార్జున రావు, ఏఈ నారాయణ రెడ్డి, సైట్ ఇంజనీర్ విజయ్, వైఎస్సార్ సీపీ నాయకులు బెట్టన గౌడ, గ్రామ పెద్దలు శరణప్ప గౌడ, తాయన్న, రమేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం - ఆంధ్రకు ఏర్పాట్లు పూర్తి



కౌతాళంలో మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్బరాజు

కౌతాళం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం – ఆంధ్ర టోర్నమెంట్-2023 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ సుబ్బరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రహ్లాదచారి సూచించారు. రేపటి నుంచి ప్రారంభమయ్యే పోటీల కోసం సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. మండల కేంద్రమైన కౌతాళం జెడ్పీ పాఠశాల, ఎరిగేరి గ్రామంలోని జడ్పీ పాఠశాల మైదానాలను బుధవారం చదును చేయించారు. పనులను పర్యవేక్షించి తగు సూచనలు అందజేశారు. ఆరు రోజుల పాటు జరిగే క్రీడా పోటీలకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు పాల్‌దినకర్, గోవిందు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఆదోనిరూరల్: ఆదోని పట్టణంలోని 16వ వార్డు అంబేడ్కర్ నగర్‌లో గుండెపోటుతో మరణించిన జయలక్ష్మి కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద మంజూరైన సాయం రూ.10 వేలు అందజేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు గంగాధర బుధవారం తెలిపారు. మిగతా సొమ్ము త్వరలో నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని వెల్లడించారు.

డిమాండ్లు నెరవేర్చాలి

కౌతాళం: అంగన్‌వాడీ టీచర్ల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేస్తామని అంగన్‌వాడీ మండల యూనియన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, మండల కార్యదర్శి ఈరన్న పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కౌతాళంలో రెండవ రోజు స్థానిక బస్టాండ్ ప్రాంతంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు జీతాలు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది ఖాసీంబి, కామాక్షి, రాధ, దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు నాగరాజు, సుంకన్న, మహదేవప్ప, వీరచంద్రయాదవ్ కోరారు. ఈ మేరకు బుధవారం మండల విద్యాధికారి బి.శివరాములును కలసి వినతి పత్రం సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ బకాయిలు, ఆర్జిత సెలవులు, భవిష్యనిధి, కరువు భత్యం వంటివి మంజూరు చేయాలని కోరారు.

జయప్రదం చేయండి

ఆదోనిరూరల్: అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో ఈనెల 15, 16, 17వ తేదీల్లో కర్నూలులో జరిగే జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఈరన్న, పట్టణ నాయకులు లక్ష్మన్న, తిప్పన్న, గోపాల్ కోరారు. ఈ మేరకు బుధవారం వారు ఆదోని పట్టణంలో ఆటో ప్రచారజాతా చేపట్టారు. వారు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన కర్నూలులో జరిగే రైతుల మహాప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నాయకులు క్రిష్ణమూర్తి, ముక్కన్న, అజీమ్‌ఖాన్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి వరకు సాగునీరివ్వాలి

కౌతాళం: తుంగభద్ర దిగువ కాలువకు సంక్రాంతి వరకు సాగునీరు ఇవ్వాలని, కరువు సహాయక చర్యలు చేపట్టాలని, రైతులకు బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య డిమాండు చేశారు. కర్నూలులో జరిగే ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం మండలంలో జీపుజాతా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి 17 వరకు జరుగే సమావేశాలకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు ఈరన్న, మారయ్య, వీరేష్, వెంకన్న, నాగరాజు, వలి పాల్గొన్నారు.